నారాయణపురం వంతెనకు మహర్దశ



మొక్కలు పెరిగిపోయి శిథిలమైన బ్రిటిష్ కాలంనాటి నారాయణపురం వంతెన



వంతెన పెచ్చులు ఊడిపోయిన దృశ్యం

- రూ.8.50 కోట్ల నిధులతో నాలుగు లైన్లతో కొత్త వంతెన
- సర్వే పనులు ప్రారంభం

ఉంగుటూరు: శిథిలమైన బ్రిటిష్ కాలం నాటి నారాయణపురం వంతెన అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వంతెన అభివృద్ధికి రూ.8.50 కోట్ల నిధులు మంజూరవడంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం సర్వే పనులు ప్రారంభించారు. ఇప్పుడున్న సింగిల్ లైనుకు బదులుగా నాలుగు లైన్ల బ్రిడ్జి నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి అవసరమైన ఆర్అండ్‌బీ స్థలం ఎంత ఉందనే అంశంపై రికార్డులను అనుసరించి మంగళవారం స్థలం సర్వే నిర్వహించారు. ఏలూరు గోదావరి కాలువపై బ్రిటిష్ కాలంలో ప్రతి గ్రామంలో వంతెనలు నిర్మించారు. ఈ వంతెనలకు కాలం చెల్లడంతో శిథిలమై ఒకొక్కటిగా కూలిపోతున్నాయి. ఇటీవల గుండుగొలను వంతెన కూలిపోయిన విషయం తెల్సిందే. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉంగుటూరు బ్రిడ్జి కూలిపోయింది. దానిని రూ.35 లక్షలు వ్యయంతో మరమ్మతులు చేసి చేతులు దులిపేసుకున్నారు. కైకరంలో వంతెన శిథిలమవ్వడంతో దివంగత మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ కొత్త వంతెన నిర్మాణానికి కృషి చేశారు.

వాహనాల రాకపోకల రద్దీ అధికం

నారాయణపురం వంతెనపై ప్రయాణికులు, వాహనాల రాకపోకల రద్దీ అధికం ఈ వంతెనపై నుంచి గణపవరం మీదుగా భీమవరం ఆర్అండ్‌బీ రహదారి ఉండటంతో ఇది ప్రధాన రహదారిగా మారింది. ఒకప్పుడు ఇది పుంత రహదారి, మూర్తి రాజు హయాంలో ప్రధాన రహదారిగా ఆ తరువాత ఆర్అండ్‌బీ రహదారిగా రూపాంతరం చెందింది. జిల్లాలో ప్రధాన మార్గాల్లో ఒకటిగా మారిన ఈ రహదారి పశ్చిమగోదావరి జిల్లాల్లోని అనేక డెల్టా గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతోంది. నారాయణపురం వద్ద ఉన్న ఈ వంతెన దాటితేనే గాని డెల్టా గ్రామాలకు వెళ్లలేరు. బరువైన లోడు లారీలు, 25 టన్నుల బరువుతో చేపలు, మేతలు, ఎరువుల లోడు లారీలు నిత్యం తిరుగుతున్నాయి. దాంతో ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. మెట్ట, డెల్టాకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న నారాయణపురం వంతెన మీద రాకపోకలు భారీగా జరుగుతుండటంతో బ్రిడ్జి శ్లాబ్ కింద భాగం పెచ్చులు ఊడిపోయాయి. పగుళ్ల మధ్య నుంచి మెక్కలు పెరిగి మరింత శిథిలావస్థకు చేరింది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈవంతెన నిర్మాణం ఆవశ్యకతను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త బ్రిడ్జి రూపు దిద్దుకోనుంది. ఆర్అండ్‌బీ ఏఈ భాస్కరరావు, ఏలూరు ఆర్అండ్‌బీ డీఈ మోహన సాయికుమార్ పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి.

ప్రజలు సంతోషిస్తారు



గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా బ్రిడ్జి నిర్మించదు. మెట్ట, డెల్టా గ్రామాలకు కూడలిగా ఉన్న నారాయణపురం వంతెన నిర్మాణంతో ప్రజలు సంతోషిస్తారు. నారాయణపురం జంక్షన్‌లో ఆధునిక వంతెన అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత రూపురేఖలు మారడంతో వ్యాపారాలు పెరుగుతాయి. ప్రజలతో పాటు వ్యాపారులకు మేలు కలుగుతుంది.

– మరడ మంగరావు, నారాయణపురం, వైసీపీ మండల అధ్యక్షుడు

వంతెన ఎంతో ఉపయోగపడుతుంది



బ్రిటిష్ కాలంనాటి వంతెన స్థానంలో ఇపుడు ఆధునిక వంతెన రూపుదిద్దుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. కొంతమంది వ్యాపారులు తమ కట్టడాలు తొలగిస్తారేమోనని బాధపడుతున్నారు. వారికి ఎంత నష్టంజరిగినా అంతకు రెట్టింపు వ్యాపారాలు పెరిగి మేలు కలుగుతుంది. వంతన నిర్మాణాన్ని స్వాగతిస్తున్నాం. ఉంగుటూరు మండలంతోపాటు డెల్టా, మెట్ట ప్రాంత గ్రామాల ప్రజలకు వంతెన ఎంతో ఉపయోగపడుతుంది.

– అడపా శ్రీనివాసరావు, ఉప సర్పంచి, నారాయణపురం

క్లుప్తంగా

వ్యవసాయ విద్యార్థుల శిక్షణపై సంతృప్తి



రావేప్ విద్యార్థుల ప్రోగ్రాం డైరీని ఆడిట్ చేస్తున్న డీన్, ప్రొఫెసర్, సైంటిస్టు

దెందులూరు : ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం శిక్షణ విద్యార్థుల డైరీ, పొలం బడి రోజువారీ శిక్షణ కార్యక్రమాలను బుధవారం దెందులూరులో డీన్ డాక్టర్ చావన్ శ్యాం రాజ్ నాయక్, ప్రొఫెసర్ టీ. అమ్మాజీ, ఏరువాక సెంటర్ సైంటిస్టు ఎన్. నాగేంద్రబాబు ఆడిట్ చేశారు. శిక్షణ పొందుతున్న విద్యార్థుల దినచర్య, క్షేత్ర ప్రదర్శన, రైతులకు శిక్షణ తరగతులపై వివరాలను శిక్షణా విద్యార్థులు ఎం.శ్వేత, పి.ప్రమీల, పి.జ్యోతిక, బి.ధరణి, ఎస్.గిరిజా, ఎం.లక్ష్మిని డీన్, ప్రొఫెసర్, సైంటిస్టులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రావేప్ విద్యార్థుల దినచర్య, శిక్షణ తరగతులపై వారు సంతృప్తి వ్యక్తం చేసి అభినందించారు.

ప్రారంభానికి సిద్ధంగా సచివాలయ భవనం



పినకడిమి సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

పెదవేగి : పెదవేగి మండలం పినకడిమి గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని ఎంపీడీఓ జి రాజ్ మనోజ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కోడ్ అమలులో ఉందని ఎంపీడీవో చెప్పారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే సచివాలయ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో బుధవారం తెలిపారు.

అభయాంజనేయస్వామికి జన్మ నక్షత్ర పూజలు



అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: అప్పనవీడు అభయాంజనేయునికి స్వామి వారి జన్మనక్షత్రం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ పాల్గొని చెరకు రసంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీతోపాటు నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు రామాచార్యులు పూజలు చేశారు.

విశ్లేషణ నైపుణ్యాలతో విజయం సాధ్యం



గణిత అధ్యాపకుడు డాక్టరు బాబూరావును సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు : విశ్లేషణ నైపుణ్యాల ద్వారా విజయం పొందవచ్చునని విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు శ్యాంబాబు అన్నారు. బుధవారం నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ కళాశాలలో గణిత శాస్త్రంపై విశ్లేషణ నైపుణ్యాలపై కార్యశాల నిర్వహించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో, పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు అవసరమైన మెళకువులను వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. డి.రెడ్డయ్య, డాక్టరు కొండారవి తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికులకు రాగి జావ తయారీపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

ఉంగుటూరు: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రాగి జావ వినియోగం, తయారీపై శిక్షణ కార్యక్రమం మండల విద్యావనరుల కార్యాలయంలో నిర్వహించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు రాగి జావ ఎలా ఉపయోగపడుతుందనే విషయాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నాగూర్‌సాహెబ్, పద్మావతి, భాస్కరారవు, ప్రసాదరాజు, ప్రేమ కుమార్, సీఆర్పీలు పాల్గొన్నారు.

గోవిందపురంలో అమ్మవార్ల జాతర

దెందులూరు: ఉప్పలమ్మ, ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో బుధవారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొన్నారు. తొలుత అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధి, గోవిందపురం గ్రామాభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. జాతరలో సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, వైఎస్సార్ సీపీ నాయకులు యలమర్తి సత్తిబాబు, నల్లూరి వెంకట్రామయ్య (బాబి), యలమర్తి బాపూజీ, గోవిందపురం వైఎస్సార్‌సీపీ నాయకులు రాజు పాల్గొన్నారు.

చల్లచింతలపూడి గ్రామాభివృద్ధికి కృషి

దెందులూరు: చల్లచింతలపూడి గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. బుధవారం రాత్రి చల్లచింతలపూడిలో మేదాదక్షిణామూర్తి శివాలయం ఉత్సవాల్లో భాగంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమ్మ శివరామకృష్ణ, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై నేడు మాక్ డ్రిల్

పెదవేగి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జాతీయ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో పెదవేగి మండలం కొప్పాకలో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తామని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్ త్రినాథరావు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ పైపు లైన్ల ద్వారా సరఫరా అవుతున్న సహజ వాయువు (మిథేన్) గ్యాస్ పైపులైన్ లీకేజీలు, అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, సిబ్బంది తీసుకోవాల్సిన అత్యవసర చర్యలు అంశంపై గురువారం మాక్ ఎక్సర్ సైజ్ నిర్వహిస్తామన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు

- ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు విడనాడాలి
- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే కొఠారు



వలంటీర్లు, గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేయడంతోపాటు కోర్టును అడ్డుపెట్టుకుని చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చెప్పారు. మండలంలోని పెదకడిమిలో వలంటీర్లు, గృహసారథులతో సచివాలయ కన్వీనర్లకు మా నమ్మకం జగన్ కార్యక్రమంపై బుధవారం దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్చి 18 నుంచి 25వరకు ఈ వారం రోజుల పాటు ఇంటింటికీ గృహ సారథులు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలను వివరించాలన్నారు. సంక్షేమ పథకాలు అందించే సమయంలో వలంటీర్లతో పాటు పార్టీ కార్యకర్తలు, గృహసారథులు వెళ్లి ప్రతిపక్షాలు, పచ్చ మీడియా చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ అసత్య ఆరోపణలను తిప్పికొట్టాల్సిన బాధ్యత వలంటీర్లు, గృహసారథులపై ఉందన్నారు.

కార్యకర్తని టచ్ చేస్తే తాటతీస్తాం

గృహ సారథులకు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఎవరైనా దాడులకు పాల్పడితే తాట తీస్తామని అబ్బయ్య చౌదరి హెచ్చరించారు. గ్రామంలో రజకులు ఎన్నో ఏళ్లగా రావుల చెరువుపై ఆధారపడి జీవిస్తుంటే ఆ చెరువు విషయంలో, ఇళ్ల స్థలాల విషయంలో టీడీపీ నేతలు కోర్టు కెళ్లారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చళ్ళగొళ్ల భూస్వామి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, కొప్పాక సొసైటీ చైర్మన్ చల్లగొళ్ల భూస్వామి, పెదపాడు మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఘంటా శ్రీనివాసరావు, పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 10వేల మందికి ఇళ్ల స్థలాలు అందించిన ఘనత అబ్బయ్యచౌదరికే దక్కుతుందన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు కొప్పాక సొసైటీ చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు.పెదపాడు మండల వైసీపీ నాయకులు ఘంటా శ్రీనివాసరావు, పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేసిన సతీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, పర్వతనేని నాగయ్య, పర్వతనేని కృష్ణారావు, కొప్పాక., పినకడిమి, భోగాపురం, అంకన్నగూడెం, దుగ్గిరాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశ్రయం సంస్థకు కొమిరేపల్లిలో గృహ నిర్మాణ బాధ్యత





కొమిరేపల్లిలో నిర్మిస్తున్న గృహాలు (అంతర చిత్రం) దాత కే. అరుణ్‌భవాని

దెందులూరు : కొత్తగూడెం పంచాయతీ కొమిరేపల్లిలో జగనన్న లేఅవుట్‌ను ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఆశ్రయం దత్తత తీసుకుంది. సింగవరంలోని 14 మంది గిరిజనులకు కొమరేపల్లి జగనన్న లేఅవుట్‌లో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. పూరి గుడిసెల్లో ఉండే గిరిజనులు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితిని తెలుసుకున్న సీఎంఓ కార్యాలయం చొరవ సమన్వయంతో ఆశ్రయం ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ కొత్తగూడెం గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. 14 మంది గిరిజనుల కుటుంబాలకు 40 బీసీ, ఇతరులకు ఇళ్లు కట్టి ఇచ్చేందుకు సీఎంఓ కార్యాలయానికి ఆశ్రయం సంస్థ అంగీకారాన్ని తెలియజేసింది. కొమిరేపల్లిలో తొలి విడత గిరిజనులకు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, ఆశ్రయం సంస్థ అధినేతకు సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, ఎంపీటీసీ వరమణి, పార్టీ జిల్లా కార్యదర్శి మెండెం సంతోష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి)కు దాత కే.అరుణ్ భవాని కృతజ్ఞతలు తెలిపారు.

క్రైస్తవుల శ్రమకాల దీక్షలు ప్రారంభం



వేగివాడ ఆర్‌సీఎం దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మాలాధారులు

పెదవేగి: భక్తి శ్రద్ధల నడుమ శ్రమకాల దీక్షలు (తపస్సుకాల దీక్షలు) ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని క్రైస్తవ భక్తులు దీక్ష చేపట్టారు. పెదవేగి మండలంలోని వేగివాడ, విజయరాయి, న్యాయంపల్లి, దుగ్గిరాల, పినకడిమి కొప్పాక, గ్రామాల్లో కతోలిక సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది క్రైస్తవులు దీక్ష చేపట్టారు. బుధవారం ఉదయం వేకువజామున భక్తులు కుటుంబ సమేతంగా బయలుదేరి దేవాలయాలకు వెళ్లి దైవ సేవకుల సమక్షంలో దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా విజయరాయి విచారణ గురువు దివాకర్, నడిపల్లి విచారణ గురువు రాజు, వేగివాడ విచారణ ఫాదర్ పాస్కాలి ప్రసంగిస్తూ మాలలు స్వీకరించిన భక్తులు 40 రోజులపాటు నియమ నిష్టలతో పరిశుద్ధ జీవనాన్ని అవలంభించాలన్నారు. నడిపల్లిలో తొమ్మిది గ్రామాల సంఘస్తులు విభూతి బుధవారం కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజు క్రైస్తవ విశ్వాసులకు జపమాల వేసి, విభూతి ఆశీర్వాదములు, దీక్ష విధి విధానాలు తెలియజేశారు. ప్రార్థనల్లో మాలాధారుల కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధల నడుమ మాలధారణ

దెందులూరు: గ్రామాల్లో క్రైస్తవుల 40 రోజుల శ్రమకాల దీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ అమ్మన్‌రాజాతో పాటు అన్ని ఆర్‌సీఎం చర్చిలు, అన్ని దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శ్రమకాల దీక్షలను ప్రారంభించారు. దీక్షా పరులు తెలుపు, ముక్కుపొడి రంగు దుస్తులను ధరించి చెప్పులు లేకుండా మాల ధరించి దీక్షలు చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంతో సత్ఫలితాలు



పూళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు

భీమడోలు: ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్యవంత సమాజ స్థాపనకు మూలమని పలువురు వక్తలు అన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నవధాన్యాల సాగు, నేల తల్లి బాగు అనే నినాదంతో పూళ్ల గ్రామ పురవీధుల్లో గ్రామస్తులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. నవధాన్యాలు సాగు చేద్దాం... భూమిని సారవంతంగా తయారు చేద్దామంటూ వారంతా నినాదాలు చేసారు. నవధాన్యాల సేద్యం, పుడమి తల్లి నైవేద్యం, నవధాన్యాలు సాగు చేయడం భూసారాన్ని పెంచండి అంటూ ప్లకార్డుల చేతపట్టుకుని వారంతా నినదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎంపీటీసీ గొండు కృష్ణ చైతన్య మాట్లాడుతూ వ్యవసాయంలో పురుగు మందులు, ఎరువులను విచక్షణారహితంగా వినియోగంలో ఉన్నందున ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయన్నారు. సబ్ డివిజనల్ యాంకర్ ఎం.నిర్మల మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్ ముందుగా రైతులు 30 రకాల నవధాన్యాలను ఎకరానికి 13 కేజీల చొప్పున సాగు చేసుకోవాలని కోరారు. రైతులు తమ భూమిలో నవధాన్యాలు సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్‌పీ ఎం.రాధిక, ఐసీఆర్‌పీలు బాబూరావు, నాగరాజు, విజయరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంట కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి



ఎంఈవో లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు

ఉంగుటూరు: శ్రీకాకుళంలో అగ్నిప్రమాదానికి గురై చనిపోయిన మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికురాలి కుటుంబానికి రూ.20 లక్షలు నష్ట పరిహారం అందజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె. వెంకట్రావు కోరారు. వంట కార్మికులతో కలిసి ఎంఈవోకి వినతిపత్రం అందజేశారు. వంట కార్మికులు గాయపడినా, చనిపోయినా బాధితులను, వారి కుంటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. జిల్లా వంట కార్మికుల నాయకురాలు బోగా అనంతలక్ష్మి, మండలంలోని వంట కార్మికులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

దెందులూరు: గోపన్నపాలెంలో బాలిక అదృశ్యమైంది. సంఘటనకు సంబంధించి తల్లిదండ్రులు మంగళవారం దెందులూరు పోలీస్‌స్టేషన్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బుధవారం ఎస్సై వీర్రాజు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పాదయాత్రపై ప్రచారం

దెందులూరు: మండలంలో ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన ఎమ్మార్పీఎస్ పాదయాత్రను అన్ని విభాగాల శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్, దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కె.మురళి కోరారు. బుధవారం నాగులదేవునిపాడులో కమ్యూనిటీ హాలులో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర, జిల్లా నాయకులు దెందులూరు మండలంలో పాదయాత్రకు హాజరవుతారని తెలిపారు. ఎంఎస్ఎఫ్, ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ విభాగాల నాయకులు విధిగా పాదయాత్రలో పాల్గొని ఎస్సీ వర్గీకరణ సమస్యకు మద్దతు తెలియజేయాలని మురళి కోరారు.

దంతులకుంట చెరువులో ఆక్వాసాగుపై ఫిర్యాదు



సరిపల్లెలో దంతులకుంట చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణస్వామి, రైతులు

గణపవరం: గణపవరం, సరిపల్లె, కొత్తపల్లి గ్రామాల రైతులకు ఉపయోగపడే దంతులకుంట చెరువును చేపల చెరువుగా మార్చవద్దని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు ఇటీవల రైతు కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో రైతులు ఆర్‌వీఎస్ రాజు తదితరులు స్పందన కార్యక్రమంలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీనితో కలెక్టర్ ఆదేశాలమేరకు గణపవరం తహసీల్దార్ కృష్ణస్వామి, వ్యవసాయ, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు దంతులకుంట చెర్వును పరిశీలించారు. ఇంతకాలం మంచి నీటి చెరువుగా ఉండేదని, ఈచెరువులో నీరు రైతులకు, వరిసాగుకు ఎంతో ఉపయోగపడేదని, ఇటీవల చెరువును పంచాయతీ పాలకులు లీజుకు ఇవ్వడం వల్ల చెరువులో చేపలు, రొయ్యలు సాగు చేపట్టారని తెలిపారు. దీని వల్ల చెరువులో నీరు కలుషితమై పంట భూములు దెబ్బ తింటున్నాయని రైతులు అధికారులకు వివరించారు. చెరువులో ఆక్వాసాగును అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, మత్స్యశాఖ ఎఫ్‌డీవో గణేషన్, ఇరిగేషన్ ఏఈ పెద్దిరాజు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధకుడు సీఎం జగన్



క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: భారతదేశ చరిత్రలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చి, పరిపాలనలో భాగస్వాములు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందని, నిజమైన అంబేడ్కర్ ఆశయ సాధకుడు జగన్ ఒక్కరేనని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ చట్టసభలలో బడుగు వర్గాలకు ప్రాతినిధ్యం అంతంత మాత్రంగా ఉంటున్న పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా జగన్ అధికారం చేపట్టాక వారి ప్రాతినిధ్యం 70శాతానికి పెరిగిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలలో అభ్యర్థుల ఎంపికే దీనికి నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించిందని అన్నారు. ఇంతకు ముందు ప్రభుత్వాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసేవన్నారు. ఇంత కాలం గుర్తింపు లేని ఎన్నో బీసీ కులాల నాయకులకు ఎమ్మెల్సీగా చట్ట సభలోకి అవకాశం కల్పించారన్నారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ పరిధిని మించి, జనరల్ స్థానాల్లోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం ఇచ్చి వారికి స్థానిక పదవుల్లో 75 శాతం కట్టబెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నామినేటెడ్ పదవుల్లో 60 శాతం బడుగు, బలహీన వర్గాలకే కేటాయించారని అన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నూరుశాతం కృషి చేస్తున్నారని అన్నారు. పాదయాత్రలో బీసీలకు ఇచ్చిన హామీ మేరకు వారికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటుచేసి నిధులు కేటాయిస్తున్నారని గుర్తుచేశారు. సామాజిక న్యాయం జగన్‌తోనే సాకారమవుతుందని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికలు జరుగనున్న 18 శాసన మండలి స్థానాల్లో 14 స్థానాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు కేటాయించడంతో ఆయా వర్గాల నుంచి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పచ్చనేతలు, పచ్చమీడియాతో పాటు వారి అనుకూల వాదులకు మతిభ్రమించిందని అన్నారు. అందుకే రాష్ట్రంలో ఏదోవిధంగా అల్లకల్లోలం సృష్టించడానికి దుష్టపన్నాగాలు పన్నుతున్నారని విమర్శించారు. వారెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మరోసారి వైఎస్సార్‌సీపీకి అధికారం అప్పగించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.